

# విధ్వంసదృశ్యం

జి.ఆర్. మహర్షి

కొందరు చాలాకాలం క్రితమే మరణించి ఉంటారు. కానీ అది తెలుసుకునే అవకాశమే వారికి రాదు.

తన మరణం సరిగ్గా ఎప్పుడు సంభవించిందో రామ్మూర్తికి జ్ఞాపకం రావడంలేదు.

పెళ్లి జరిగినప్పుడా?

ఉద్యోగంలో చేరినప్పుడా?

ఉహు! అసలు తాను మరణించే పుట్టాడేమో!

నిజమైన మనిషి ఎప్పుడైనా పుట్టాడా?

బాల్యం... తండ్రి జులుం, వంటింట్లో పొగ చూరిపోయిన తల్లి. కిటికీ వద్ద నిర్జీవంగా కూచొని బయటి ప్రపంచాన్ని చూసే అక్కయ్య. స్కూల్ నుంచి ఇంటికి రాగానే అదోరకమైన భయం. హింస వాసన!

తండ్రి- పెద్దపులి

వీధిలో వస్తూ ఉండగానే పంజా విసురుతున్న శబ్దం.

అయినా అప్పుడప్పుడు చెట్లెక్కడం, ఈత కొట్టడం, స్నేహితులు సూర్యోదయాలు.

తరువాత ఒళ్లు వాచిపోయే దెబ్బలు, ఓదార్చే ధైర్యం కూడా లేనితనం. వయసొచ్చిన అక్కయ్య ప్రతి కదలికపైనా తండ్రి డేగ కళ్ల నిఘా. ఆమె చదువును చిన్నప్పుడే మానిపించారు. ఆడపిల్లలు పనీపాటా నేర్చుకుంటే భర్తకు సుఖం.

తరువాత ఒక అర్భకుడితో అక్కయ్య పెళ్లి- ఇప్పుడామెకి హిస్టీరియా.

తానేం చదవాలో తండ్రే నిర్ణయించాడు. చివరికి తన పెళ్లి కూడా. శుభ్రంగా ఉన్న గది- కుర్చీలో తను, పక్కన తండ్రి, మరో ఇద్దరు మానసిక వృద్ధులు.

కాఫీ కప్పు పట్టుకొని ఒక అమ్మాయి వచ్చింది. కొన్ని క్షణాల చూపుల కలయిక తరువాత వ్యాపార లావాదేవీలు పూర్తి అయ్యాయి.

పెళ్లి చేసేయ్యండి- తోసేయ్యండి శతాబ్దాల చీకట్లోకి!

అనుభూతులతో నిమిత్తం లేకుండా రెండు మాంసఖండాలు ఒకే చూరు కింద కలిసి బతకడం- మన వివాహవ్యవస్థ పవిత్రమైనది- చెదలు తిన్న గ్రంథాల ఘోష!

చిన్నప్పుడు అనుకునేవాడు. తొందరగా పెరిగి పెద్దయితే ఎవరి భయమూ లేకుండా స్వేచ్ఛగా ఉండొచ్చని, కాని మనిషి పెరిగే కొద్దీ పరిపూర్ణ బానిస.

"ఆఫీస్‌కు టైమ్ కాలేదా?"

భార్య కేకకు ఉలిక్కిపడ్డాడు.

ఆఫీస్ - లేట్ రిజిష్టర్ - బాస్ కేకలు - మెమో - ఉద్యోగంలోంచి తీసేస్తారనే భయం.

ఉద్యోగులు యంత్రాలకంటే అన్యాయం. యంత్రాలకు ఉద్యోగం పోతుందనే భయం ఉండదు.

కోపం, భయం, జుగుప్సలతో కూడిన ఒక భావన శరీరమంతా ప్రవహించింది.

ఈరోజు ఆఫీస్ గానుగ వదిలించుకోవాలి.

చొక్కా తడుముకున్నాడు, ఫరవాలేదు కొంత డబ్బుంది.

'నువ్విప్పుడు వీరుడివి' భుజం తట్టుకున్నాడు.

బయట చిన్నగా చినుకులు, చలి చల్లగా ఉంది.

''కారియర్ కడుతున్నాను, కొంచెంసేపు వుండండి.''

"అక్కర్లేదు."

"హోటల్లో తింటే డబ్బు ఖర్చు." ఆరోగ్యం చెడిపోతుందని మాత్రం అనదు.

"వర్షం! గొడుగు తీసుకెళ్లండి."

"అక్కర్లేదు. తడుస్తాను."

"మీకేం తడుస్తారు. తరువాత రోగమూ, రొష్టూ, చావాల్సింది నేనేగా, కొంప విషయాలు ఏమన్నా పట్టించుకుంటున్నారా? పిల్లలు అస్సలు చదవరు. తండ్రన్నవాడు నాలుగు దండించాలి."

తన తండ్రి గుర్తుకొచ్చాడు- మొగ్గల్ని చిదిమే తోటమాలి.

"వర్షం పెద్దగా రావటం లేదు, చిన్న చినుకులే, నడిచే వెళ్లండి. రిక్షావాళ్లు బోలెడు అడుగుతారు."

పెళ్లయిన తొలి రోజుల్లో- భార్య తలలోని మల్లెల్ని ముద్దాడుతూ, "ఎంత బావున్నాయో!" అన్నాడు.

"అవును. మూర రెండు రూపాయలు, రోజూ రూపాయికే ఇచ్చేవాళ్లు అనవసరంగా కొన్నాను."

విరిగి పడిన కెరటాలు- అగ్నిసాక్షిగా కలల దహనం.

బయటికొచ్చాడు.

చినుకులు శరీరాన్ని ముద్దాడుతున్నాయి.

తల పైకెత్తి, నాలుక బయటపెట్టి ఆకాశాన్ని వెక్కిరించాడు. టపీమని మూడు నాలుగు చినుకులు పడ్డాయి.

పసితనంలోకి మెటామార్ఫసిస్!

రోడ్డుపైకి వచ్చి ఆటోను ఆపాడు.

ఆఫీస్ అడ్రస్ చెప్పాడు. ఆటో కదిలింది.

విడివిడిగా భూమిని తాకుతున్న చినుకులు, ప్రవాహమై మురుగులో కలిసిపోతున్నాయి- మనుషుల్లాగే.

రోడ్డుపై గొడుగుల ఊరేగింపు!

బట్టలు లేని ఇద్దరు చిన్నపిల్లలు శరీరాన్ని చినుకులతో కప్పుకుంటున్నారు.

వర్షానికి వేడెక్కిన టీ దుకాణాలు.

తడిసి ముద్దవుతున్న వాల్ పోస్టర్ల హీరోయిన్ల అంగాంగాలు!

ఆటో ఆగింది.

భయంకర రాకాసి మృగంలా కనిపించింది ఆఫీస్ బిల్డింగ్!

మరిచిపోయాడు. ఈరోజు తాను ఈ మృగం నోట్లోకి వెళ్లరాదు. మరి ఇక్కడికెందుకు వచ్చాడు? తెలియదు.

చిన్నప్పుడు పుస్తకాల్లో ఒక లెక్క ఉండేది. ఒక గుంజకు కట్టేసిన మేక ఎంత చుట్టుకొలత తిరుగుతుంది?

వెళ్లిపోతుండగా తన కొలీగ్ మూర్తి వచ్చాడు.

"వెళ్లిపోతున్నావేం సెలవా?"

"లేదు".

"పర్మిషనా?"

"ఉహూ".

"బాస్ అరుస్తాడేమో?"

"వాడి మొహం."

ఇవన్నీ యథాతథంగా బాస్‌కు మోస్తాడని తనకు తెలుసు.

తపాలాగాడికి మంచి బరువు.

ఎక్కడి కెళ్లేది? తెలియదు.

మనసంతా చిత్తడిగా ఉంది.

చిన్నతనంలో చనిపోయిన తన బుజ్జి కుక్కపిల్ల గుర్తొచ్చింది. వర్షం వస్తే పొయ్యి వెలిగించడానికి అమ్మ పడే బాధ... పొగ, కన్నీళ్లు, దగ్గు- వంట బాగాలేదని తండ్రి తిట్టే తిట్లు అన్నీ గుర్తొచ్చాయి.

శరీరంలో ఏదో తగలబడిపోతోంది. దాన్ని ఆర్పే శక్తి వర్షానికి లేదు.

వర్షం ఎక్కువవుతోంది.

ఎక్కడైనా ఇసుక కనిపిస్తే బావుండు- గుడి కట్టొచ్చు.

నీళ్లను విరజిమ్ముతూ ఒక మారుతి కారు వచ్చి ఆగింది.

తెల్లటి కారుమీద జారిపోతున్న వర్షం. గట్టిగా కారుని తాకడానికి చినుకు కూడా భయపడుతూ వుంది.

తలుపు తెరుచుకుంది.

"హలో రాం, ఎక్కడికీ?"

జాన్, తన చిన్ననాటి స్నేహితుడు.

"తెలియదు."

"అయితే కారెక్కు," బిడియంగా ఎక్కాడు.

కారు కదిలింది.

"ఎలా ఉన్నావు?" ప్రశ్నించాడు జాన్.

నిర్లిప్తంగా నవ్వాడు.

వెనుక నుంచి గుర్రుమని శబ్దం వినిపించింది. తిరిగి చూశాడు.

భయం గొలిపే కుక్క నాలుక సాచి చూస్తూ వుంది.

"భయపడకు! ఏం చేయదు. మొన్ననే కొన్నాను. ఏ కుక్కనూ ఎక్కువకాలం ఉంచుకోను. వాటి విశ్వాసం మీద నాకు నమ్మకంలేదు. రెండు రోజులపాటు మాంసం వేయకుంటే తెలుస్తుంది కుక్క నిజాయితీ. ప్రపంచంలో దేన్నీ నమ్మకపోవడం ఒక కళ."

చిత్రమైన జాన్!

బడిలో చిరిగిన బట్టలతో వెనుక కూర్చునేవాడు. చిన్నప్పుడు జాన్ దగ్గర ఒక రకమైన మురికి వాసనొచ్చేది. ఇప్పుడు డబ్బు వాసన, అట్టే తేడాలేదు.

"ఈ కుక్క పేరేమిటో తెలుసా? బ్రూటస్, విద్రోహి పేరు. భలే వైరుధ్యం. కదా?" ఫెళ్లున నవ్వాడు.

కారు అద్దాల మీద సున్నితంగా జారిపోతున్న వాన నీటిని వైపర్స్ తుడుస్తున్నాయి.

కళ్లకు కూడా వైపర్స్ ఉంటే బావుండును- కన్నీళ్లు తుడవడానికి.

"వాతావరణంలో గ్లాసులు బద్దలు కావాల్సిందే," అన్నాడు జాన్.

ఒక బార్ ముందు కారు ఆగింది.

ఇద్దరూ దిగారు.

వర్షం పెద్దదవుతూ ఉంది. ఆకాశం వైపు విసుగ్గా చూశాడు జాన్. "వర్షంలోనే నా తల్లి శవాన్ని పాతి పెట్టాను. ఎవ్వరూ తోడు కూడా రాలేదు. నా తల్లి చరిత్ర అంత మంచిది కాదు కదా.

"నేనూ, ఒక ముసలాయన ఇద్దరమే! ఎద్దుల బండి మీద శవాన్ని తీసుకెళ్లాం. ఆ ముసలాయనే గొయ్యి తీశాడు. శవాన్ని గొయ్యిలోకి దించడానికి ఇద్దరం చాలా కష్టపడ్డాం.

"మా అమ్మ ఇప్పుడు గనుక చనిపోయి ఉంటే, ఊరంతా కదిలివచ్చి శోకాలు పెట్టి ఉండేది.

"బాస్టర్డ్స్ మనుషులంటేనే నాకు కసి."

జాన్ మొహం మీది కండరాల్లో ఒక దు:ఖపు కదలిక.

బార్‌లోకి అడుగుపెట్టారు.

ఒక యువకుడు ఎదురొచ్చి, "సార్! ఇంత ఉదయాన్నే సర్వ్ చేయరు," అని వినయంగా చెప్పాడు.

"మీ ఓనర్ పేరేమిటి?" కూల్‌గా అడిగాడు జాన్.

"విక్టర్ సాబ్ సార్!"

"విక్టర్ కాదు, జాన్ విక్టర్... అంటే నేనే."

యువకుడి మొహం పాలిపోయింది.

"క్షమించండి సార్! నేను కొత్తగా చేరాను. మిమ్మల్ని ఎప్పుడూ చూడలేదు," వణికిపోతూ చెప్పాడు.

భయం, అభద్రతాభావన.

జేబులో నుంచి యాభై రూపాయల నోటు తీశాడు జాన్.

"ఉద్యోగాన్ని సక్రమంగా చేస్తున్నందుకు- ఇది నీకు బక్షీస్. కారులో నా కుక్క ఉంది. దాన్ని కాస్త ఎంటర్‌టెయిన్ చెయ్యి. భయపడకు అది కరవదు. మనుషుల్ని చంపడం మాత్రమే దానికి తెలుసు."

ఆ యువకుడి మొహంలోని భావాలను గమనించకుండా ముందుకు కదిలాడు జాన్. క్షణాల్లో బల్ల మీద సీసాలు, గ్లాసులు. "మనుషుల్ని దిగ్భ్రాంతి పరచడం నా హాబీ!" విస్కీని గ్లాస్‌లోకి వొంపాడు జాన్. "చీర్స్." గొంతులోకి జారిన విస్కీ రెక్కల్ని మొలిపిస్తూ ఉంది. ఘాటైన సిగరెట్ పొగ- స్టీరియోలోంచి మత్తుగా వీస్తున్న సంగీతం. కొంచెం కొంచెంగా అర్పించుకుంటున్న విస్కీ బాటిల్- రక్తనాళాల్ని శ్రుతి చేస్తున్న మత్తు.

విస్కీలో సోడా మమేకమై ఆనందంతో పొంగి పొరలుతూ ఉంది.

"అసలు మనుషులెందుకు బతుకుతారు?" ప్రశ్నించాడు జాన్.

"చిన్నప్పుడు అన్నింటికి ముఖ్యం డబ్బే అనుకునేవాడిని. అందరూ దానికోసమే బతుకుతారని నమ్మేవాడిని. ఇప్పుడు నాకు కావాల్సినంత డబ్బుంది. ఒక్క రోజైనా మనశ్శాంతిగా నిద్రపోయానా? దురదృష్టం. ఎంత తాగినా మత్తెక్కదు. ఎంత దు:ఖమొచ్చినా కన్నీళ్లు రావు. అసలు నేను కన్నీళ్లే లేకుండా పుట్టానేమో!" తనలో తానే మాట్లాడుకుంటున్నాడు జాన్.

చాలారోజులుగా పేరుకుపోయినదానికి విడుదల కావాల్సి వచ్చింది. రామ్మూర్తి ఒక మీడియా అంతే!

"అమ్మ పాచిపని చేసేది. రాత్రిళ్లు గుడిసెలోకి మగవాళ్లు వచ్చేవారు. నేను బయట కాపలా. చలిలో ఒక్కడినీ వణుకుతూ పడుకునేవాడిని. పకపకలు, మూలుగులు చెవులు మూసుకున్నా వినిపించేవి. 'మగవాళ్లు ఎప్పుడు వెళ్లిపోతారా,' అని జాగారం. వాళ్లు వెడితే ఇంట్లో పడుకోవచ్చనే ఆశ. వాళ్లు తెచ్చిన తిండి పదార్థాల్లో మిగిలినవి తినాలనే కోరిక."

విస్కీలో మంచుముక్క అస్తిత్వాన్ని కోల్పోతూ ఉంది.

"అమ్మకు జబ్బు చేసింది. అదేం రోగమో, ఒకటే దుర్వాసన. కొంచెం కొంచెంగా చనిపోయింది. ఏడుపొచ్చింది. సంతోషం కూడా- దుర్వాసన తప్పినందుకు! నగరానికొచ్చి పడ్డాను. తరిమితరిమి కొట్టింది. కుక్కలకున్నంత భద్రత కూడా మనుషులకు లేదిక్కడ.

"బలముంటేనే బతుకుతాం. అలాగే బతికాను. ఒకసారి వెనక్కి తిరిగి చూసుకుంటే ఇదంతా దేనికోసం?

"ఎక్కడికైనా పారిపోవాలనిపిస్తుంది.

"మనిషి తనలోకి తాను తప్ప ఎక్కడికి పారిపో గలడు? జ్ఞాపకాల వేటకుక్కలు నిరంతరం తరుము తూనే ఉంటాయి."

తలుపు దగ్గర చిన్న అలికిడి.

జాన్ ఒక్కసారిగా అలర్ట్‌గా మారాడు. జేబులో ఉన్న రివాల్వర్ మీద చెయ్యి వేశాడు.

కండలు తిరిగిన ఒక వ్యక్తి లోపలికి వచ్చాడు.

"నమస్తే జాన్ సాబ్!"

"రా, మస్తాన్!" జాన్ మొహంలో చిరునవ్వు.

మస్తాన్ అనుమానంగా రామ్మూర్తి వైపు చూశాడు.

"మనవాడే, ఫికర్ వద్దు. హాని తలపెట్టడానికి కూడా కొంచెం ధైర్యముండాలి."

"వెళ్లిన పని ఏమైంది?" ఒక గ్లాస్‌లో విస్కీ పోసి మస్తాన్ ముందు పెట్టాడు జాన్.

"కష్టం సార్! వాడు లొంగడు," చెప్పాడు మస్తాన్.

జాన్ మొహంలో అసహనం.

"ప్రతి మనిషికి ఒక రేటు ఉంటుంది మస్తాన్," అన్నాడు.

"అన్ని విధాల ప్రయత్నించాను ప్రయోజనం లేదు."

జాన్ కాసేపు మౌనంగా ఉన్నాడు.

సోడా విస్కీ రంగును మారుస్తూ ఉంది.

"వాడికి పిల్లలెంతమంది?" అడిగాడు జాన్.

"ఇద్దరు," చెప్పాడు మస్తాన్.

"పాపం! రేపటి నుంచి తండ్రిలేని పిల్లలు," జాన్ మొహంలో ఏ భావమూ లేదు.

అర్థమయ్యిందన్నట్టుగా చూశాడు మస్తాన్.

"ఆల్ ది బెస్ట్," అన్నాడు జాన్.

స్టీరియోలో మ్యూజిక్ ఆగిపోయింది.

"సుఖపడటానికి రాత ఉండాలి. చంపాలంటే నాకేమైనా సరదానా? నీతి నిజాయితీ అంటూ వాగాడు... అసమర్థుల పదజాలం."

"ప్రాణం చాలా విలువైంది జాన్! ఒక మనిషి చుట్టూ ఎన్నో జీవితాలు, అనుబంధాలు, స్నేహాలు, ఆత్మీయతలు ఉంటాయి. ఇవి నీకు చెప్పినా అర్థం కావు," అన్నాడు రామ్మూర్తి.

"నిజమే! నాకు సెంటిమెంట్స్ లేవు. వాటితో జీవితాన్ని చంపుకోవటం నాకు చేతకాదు. మనం సుఖ పడ్డం కోసమే ఈ లోకం మీదికొచ్చాం. సుఖపడాలి అంతే. తర్కం వద్దు. మన సుఖానికి ఎవరైనా అడ్డువస్తే తల తీసెయ్యాలి అంతే!"

రామ్మూర్తి పైకి లేచాడు. "వస్తా జాన్," అని వెళ్లిపోతూ, "ఒక్కమాట," అన్నాడు.

"ఏమిటి?" అడిగాడు జాన్.

"జీవితంలో ఎలాంటి విలువలూ లేని నువ్వొక పురుగువి. నువ్వంటే నాకసహ్యం. గుడ్ బై."

"నిజమే! నేనొక పురుగునే! కాని పురుగుకి కూడా ఎంతో కొంత ఉనికి ఉంటుంది. కాని నీ సంగతేమిటి? నాలాంటివారు జీవితంలో విజయాలు సాధిస్తూ వెళ తారు. విజేతల మీద ఆరోపణలు చేస్తూ నీలాంటివారు బతుకును ఈడుస్తూ ఉంటారు. నువ్వంటే నాకు సానుభూతి."

బార్‌లోంచి బయటికొచ్చాడు రామ్మూర్తి.

వర్షం కొంచెం తగ్గింది.

రోడ్ల మీద నీళ్లు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.

నీళ్లలో నడుస్తూ క్రిందికి చూశాడు. తాను నీళ్ల మీద తేలుతూ ముందుకు వెళుతున్న ఫీలింగ్.

ఒక పిచ్చివాడు వర్షం నీళ్లను తీర్థంలా తాగుతూ నవ్వుతున్నాడు.

గొడుగుల్లో తలలు దాచిపెట్టుకొని జనం నిదా నంగా అడుగులు వేస్తున్నారు.

ఒకాయన దగ్గరికొచ్చి, "దేవుడికి గుడి కడు తున్నాం చందా..." అంటూ చేతిలోని డబ్బాను అందిం చాడు.

రామ్మూర్తికి నవ్వొచ్చింది.

"దేవుడు చనిపోయాడన్న విషయం నీకు తెలి యదా?" అన్నాడు. మనసులో 'థాంక్యూ నీషే' అను కున్నాడు.

ఇది విని పిచ్చివాడు రామ్మూర్తి దగ్గరికొచ్చి, "మనిషి ఎప్పుడో చనిపోయాడన్న విషయం నీకు తెలియదా?" అని పెద్దగా నవ్వి వెళ్లిపోతూ ఆగాడు.

రామ్మూర్తి చెవి దగ్గరికొచ్చి, "ఇది రహస్యం! ఈ నాలుగు రోడ్ల కూడలిలో నిలబడి మనిషి కోసం ఏళ్ల తరబడిగా వెతుకుతున్నాను కానీ కనబడలేదు. పునరుత్థానం ఒక కట్టుకథ," అన్నాడు.

*ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, సెప్టెంబరు 29-అక్టోబరు 15, 1993*